క్లుప్తంగా

నేడు లక్ష్మీపురంలో గడప గడపకూ..

దేవరపల్లి: గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి దేవరపల్లి మండలం లక్ష్మీపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్ సీపీ నాయకులకు ఎంపీ భరత్ పరామర్శ

నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లిలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుల కుటుంబ సభ్యులను రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ బుధవారం పరామర్శించారు. పురుషోత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు సుంకవల్లి శ్రీహరి మేనమామ ఇజ్జవరపు బుచ్చిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కుమ్మరి భాస్కరరావు భార్య పాపమ్మ ఇటీవల మృతి చెందారు. వారి చిత్రపటాలకు ఎంపీ భరత్‌రామ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టిడ్కో గృహాలు కేటాయించాలంటూ ఆందోళన

నిడదవోలు: పట్టణంలోని తీరుగూడెంలోని టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేయాలని కోరుతూ టీడీపీ సీనియర్ నాయకుడు కుందుల వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కేటీ పద్మావతికి వినతి పత్రం అందజేశారు. వాకలపూడి వెంకటరత్నం, గజ్జరపు శ్రీనివాస్, మద్దుకూరి రాధ, పేదూరి సాయిబాబా పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలపై వర్క్‌షాప్

కొవ్వూరు: అధ్యాపకులు ఎప్పటికప్పుడు తమ వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ సూచించారు. తాము బోధించే సబ్జెక్టుల్లో కొత్తగా వస్తున్న టెక్నాలజీకి అనుగుణంగా మార్పులు చేసుకుంటూ బోధించాలన్నారు. ప్రముఖ ఫెసిలిటేటర్, ట్రైనర్ నెక్కంటి శ్రీనివాస చక్రవర్తి కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌పై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎమ్‌వీ సుబ్బారావు, యాజమాన్య ప్రతినిధి అల్లూరి కావ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

అకౌంట్స్, బ్యూటీ థెరపీ కోర్సుల్లో శిక్షణ

నిడదవోలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు అకౌంట్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ బ్యూటీ థెరపీ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పట్టణంలో ఎస్వీఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి చెప్పారు. మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఇంటర్ పాసైన 19 నుంచి 30 ఏళ్ల యువతీ యువకులు ఈనెల 19 తేదీ నుంచి కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం 96760 52454, 84999 43366 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు.

కెమెరాల చోరీపై మూడు కేసులు నమోదు

కొవ్వూరు: కెమెరాలు చోరీ అయ్యాయంటూ అందిన మూడు వేర్వేరు ఫిర్యాదులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆ వివరాలిలా ఉన్నాయి. గత నెల 28న వేములూరులో నిర్వహించిన ఓ వేడుకలో ఫొటోలు తీయడానికి వచ్చిన చిడిపి గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ అంబటి శ్రీసూర్య ప్రకాష్ కెమెరా చోరీకి గురైంది. దీనిపై ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ తెలిపారు. అలాగే ఈనెల 2 న ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మలకపల్లికి చెందిన పుచ్చకాయల దుర్గాగణేష్‌కు చెందిన కెమెరా చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎం.సునోద్ కుమార్ మరో కేసు నమోదు చేశారు. అదే రోజు సీతానగరం మండలం ముగ్గళ్లకు చెందిన గెద్దం అనిల్ కుమార్ అనే ఫొటోగ్రాఫర్‌కి చెందిన కెమెరా కూడా చోరీకి గురైంది. కొవ్వూరు ఫంక్షన్‌కు వచ్చినపుడు గుర్తుతెలియని వ్యక్తులు తన కెమెరాను కాజేశారంటూ అనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.భూషణం తెలిపారు.

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ

దేవరపల్లి: సంక్రాంతి సందర్భంగా దేవరపల్లి పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది,కార్మికులకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీపీ కేవీకే దుర్గారావు చేతుల మీదుగా 45 మంది కార్మికులు, సిబ్బందికి ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున దుస్తులు అందజేశారు. దుస్తులతో పాటు టవల్స్, సబ్బులు, కొబ్బరి నూనె అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శులు హరిబాబు, కృష్ణ, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

చాగల్లు: నూతన సంవత్సరం, సంక్రాంతి పండగ సందర్భంగా బుధవారం పంచాయతీ వర్కర్స్‌ కు, సిబ్బందికి సర్పంచ్ ఉన్నమట్ల మనశాంతి చేతుల మీదుగా నూతన దుస్తులు, కొబ్బరినూనె, సబ్బులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

నారీమణుల ఓట్లే కీలకం



- పూర్తయిన ఓటర్ల సవరణ
- తుది జాబితా విడుదల
- కొవ్వూరులో పురుషుల కంటే 4,390 మంది మహిళా ఓటర్లు అధికం
- నిడదవోలులో 3,751, గోపాలపురంలో 2,911 మంది అధికంగా మహిళా ఓట్లు

కొవ్వూరు: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక ఓటర్ల సవరణ-2023 ప్రక్రియ పూర్తయ్యింది. సవరణ ద్వారా గత జాబితా కంటే నియోజకవర్గాల వారీగా గోపాలపురంలో గరిష్ఠంగా 2,122 ఓట్లు, నిడదవోలులో 1,223, కొవ్వూరులో 1,102 ఓట్లు పెరిగాయి. గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల్లో రెండేసి లక్షలకు పైబడి ఓటర్లు ఉంటే కొవ్వూరు నియోజకవర్గంలో మాత్రం 1,77,327 మంది ఉన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో అత్యధికంగా 2,33,857 మంది ఓటర్లు, నిడదవోలు నియోజకవర్గంలో 2,06,185 మంది ఓటర్లు ఉన్నారు. ప్రత్యేక సవరణ వల్ల కొవ్వూరు నియోజకవర్గంలో కొత్తగా 1,102 ఓట్లు పెరిగాయి. వారిలో 548 మంది మహిళలు, 554 మంది పురుషులు ఉన్నారు. మొత్తంగా నియోజకవర్గంలో మహిళా ఓటర్లదే పైచేయి. ఇక్కడ మొత్తం ఓటర్లు 1,77,327 మంది ఉంటే వారిలో పురుషులు 86,464 మంది, మహిళా ఓటర్లు 90,854 మంది. డ్రాఫ్ట్ పబ్లికేషన్ సమయానికి నియోజకవర్గంలో 1,76,225 మంది ఓటర్లు ఉన్నారు. గతంలో ఉన్న 181 పోలింగ్ బూత్‌లను 174కు కుదించారు. ప్రత్యేక సవరణ ద్వారా మండలాలా వారీగా చాగల్లులో గరిష్ఠంగా 643 ఓట్లు, కొవ్వూరులో 431, తాళ్లపూడిలో 148 ఓట్లు పెరిగాయి. ఇక కొవ్వూరు మునిసిపాలిటీలో 176 ఓట్లు పెరిగాయి. నియోజకవర్గాల వారీగా కొవ్వూరులో 4,390, నిడదవోలులో 3,751, గోపాలపురంలో 2,911 ఓట్లు పురుషుల కంటే మహిళా ఓట్లు అధికంగా ఉన్నాయి.

కొవ్వూరు నియోజకవర్గంలో ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల వివరాలు

మండలం	గతంలో పీఎస్‌లు	ప్రస్తుతం పీఎస్‌లు	మహిళలు	పురుషులు	ఇతరులు	పెరిగిన ఓటర్లు
కొవ్వూరు (పట్టణం)	29	28	15,623	17,335	4	176
కొవ్వూరు (మండలం)	58	53	26,214	27,043	1	431
చాగల్లు	50	49	24,745	25,775	0	643
తాళ్లపూడి	44	44	19,882	20,701	4	148
మొత్తం	181	174	86,464	90,854	09	1,104

నియోజకవర్గాల వారీగా స్త్రీ, పురుష ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	మొత్తం ఓట్లు
గోపాలపురం	1,15,468	1,18,379	2,33,857
నిడదవోలు	1,01,213	1,04,964	2,06,185
కొవ్వూరు	86,463	90,855	1,77,327

ప్రత్యేక సవరణలో 3,508 దరఖాస్తులు

ఓటర్ల ప్రత్యేక సవరణ ద్వారా సెప్టెంబర్ 11 నుంచి డిసెంబర్ 8 వరకూ కొవ్వూరు నియోజకవర్గ వ్యాప్తంగా 3,508 దరఖాస్తులందాయి. వాటిలో కొత్త ఓటు నమోదు కోసం 3,306 దరఖాస్తులు అందగా, వాటిలో వివిధ కారణాలతో 91 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఓటు తొలగింపు కోసం ఫారం-7కి 2,076 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 14 మంది దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన 2,060 దరఖాస్తులు అనుమతిచ్చారు. మార్పులు, చేర్పుల కోసం ఫారం-8 ద్వారా 228 దరఖాస్తులు రాగా, వాటిలో 215 దరఖాస్తులను అంగీకరించారు.13 దరఖాస్తులను తిరస్కరించారు. ఒక కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఓటు బదిలీ కోసం 302 దరఖాస్తులు రాగా, వాటిలో 41 తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 261 దరఖాస్తులను అంగీకరించారు.

పేకాట, కోడిపందేలు ఆడుతున్న ఏడుగురి అరెస్టు

ఉండ్రాజవరం: ఇక్కడి నుంచి చిలకపాడు వెళ్లే రోడ్డులోని కోకో తోటల్లో పేకాడుతున్న అదే గ్రామానికి చెందిన నలుగురిని, సూర్యారావుపాలెంకు మరోవ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై కె.రామారావు బుధవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3050 నగదు, ఐదు బైకులు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే చివటంలో కోడి పందేలు ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1150 నగదు, ఒక కోడి, ఒక కత్తిని స్వాధీన పరుచుకున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు మాట్లాడుతూ పాత కేసులు కలిగిన 25 మందిని బుధవారం తహసీల్దార్ జి.కనకరాజు ఎదుట బైండోవర్ చేయించారన్నారు. ఏఎస్సై ప్రసాదరావు, కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తమ టీమ్‌ల ద్వారా వంద మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారని తెలిపారు.

అరికిరేవులలో ఆరుగురి అరెస్టు

కొవ్వూరు: అరికిరేవుల గ్రామంలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను బుధవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5,300 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.నిందితులను గురువారం కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

కొవ్వూరు: పశివేదల గ్రామంలో కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు.వారి వద్ద నుంచి రెండు కోళ్లు, మూడు కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

విద్యారంగంపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి



శెట్టిపేటలో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సూరిబాబు, ఎంపీపీ భాగ్యలక్ష్మి

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపాలెం ప్రాథమికోన్నత పాఠశాల్లో పల్లారావు, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, శెట్టిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మిలు 8వ తరగతి విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చెప్పినట్టు విద్యార్థులు కలలు కనడమే కాకుండా వాటిని సాకారం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో సర్పంచులు ముప్పిడి చంద్రశేఖర్, జద్ది శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు వడాల రంగారావు, బయ్యే కృష్ణబాబు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు తిరుమళ్ల దుర్గారావు, వడాల రంగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో భూములు సారవంతం



రైతులకు ఆర్గానిక్ ఎరువులను అందిస్తున్న గెయిల్, కేర్ ఇండియా అధికారులు

కొవ్వూరు: సేంద్రియ ఎరువుల వాడకంతో భూమిలో కర్బన శాతం పెరిగి నేల సారవంతం అవుతుందని వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కె.రాఘవేంద్రరెడ్డి, బి.వెంకట సుబ్బయ్య అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై మండలంలోని పెనకనమెట్ట గ్రామంలో రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇటీవల ఈ గ్రామంలోని పలువురు రైతుల పొలాల్లోని మట్టి నమూనాలను పరీక్షించగా కర్బన శాతం తక్కువగా ఉన్నట్టు తేలిందన్నారు. మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడితే భూమి నిస్సారం అవుతుందని శాస్త్రవేత్తలు అన్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే వనరులను పంటలకు వినియోగించుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా గెయిల్, కేర్ ఇండియా సంస్థ సంయుక్తంగా సమకూర్చిన రూ.రెండు లక్షల విలువైన ఆర్గానిక్ ఎరువులను సుమారు 100 మంది రైతులు అందజేశారు.గెయిల్ డీజీఎం కె.కాశేశ్వరన్, సీనియర్ హెచ్‌ఆర్ పి.బాలాజీ, కేర్ ఇండియా ప్రాజెక్ట్ మేనేజర్ ఇవ్విరెడ్డి ప్రసాద్, యాళ్ల శ్రీనివాస్, జి.గోపాలకృష్ణ, మామిడిపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



తాళ్లపూడి మాంటిస్సోరి హైస్కూల్లో సంప్రదాయ దుస్తుల్లో అలరిస్తున్న విద్యార్థినులు

కొవ్వూరు: విద్యా సంస్థలకు సంక్రాంతి ముందే వచ్చింది.గురువారం నుంచి పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు, రంగవల్లులు, డూడూ బసవన్నల ప్రదర్శనలకు తోడు సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సందడి చేశారు. కొవ్వూరు సత్యవతీ నగర్‌లోని సద్గురు ఇంగ్లిష్ మీడియం పాఠశాల్లో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు.తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా భోగి మంట వేశారు. ఆవరణలో రంగురంగుల ముగ్గులు తీర్చిదిద్దారు. పిండి వంటకాలతో విద్యార్థులు ప్రదర్శన ఏర్పాటు చేశారు. మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ కంఠమణి కీర్తిశ్రీ , కౌన్సిలర్ కంఠమణి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: ముందస్తు సంక్రాంతి సంబరాలతో నల్లజర్లలోని సెయింట్ క్లారెట్స్, భాష్యం స్కూళ్లలో సందడి నెలకొంది.సెయింట్ క్లారెట్స్ స్కూల్లో విద్యార్థుల తల్లులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ బహుమతులను నాగలక్ష్మి, ప్రత్తి సూర్యప్రభ గెలుచుకున్నారు. ఫాదర్ జోసెఫ్ శాంతప్ప, టోమీ, బిపిన్, ఏసుపాదం పాల్గొన్నారు. నల్లజర్ల భాష్యం స్కూల్లో సంక్రాంతి సంబరాల సందర్భంగా బొమ్మల కొలువు, గంగిరెద్దుల విన్యాసాలు, భోగిమంటలు, రంగవల్లులతో విద్యార్థులు సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని వెలగదుర్రు ప్రాథమిక పాఠశాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగిమంట వేసి, గొబ్బెమ్మలు పెట్టి పువ్వులతో వాటిని అలంకరించారు. గంగిరెద్దుల విన్యాసాలు, రంగవల్లులు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వెలగదుర్రు సర్పంచ్ సాగి పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు ధనిశెట్టి భ్రమరాంబ, హెచ్ఎం అహల్య, అనంతలక్ష్మి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడి మాంటిస్సోరీ హైస్కూల్లో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగిపళ్లు, గొబ్బెమ్మలు, చెరకు గడలు, అరటి మొక్కలు, ధాన్యపు రాశులతో బాలికలు ముగ్గులను సుందరంగా అలంకరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థినులకు ఎస్సై కె. వెంకటరమణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. హరిదాసుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ వీవీ అనీష్, ఆశా అనీష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నల్లజర్ల భాష్యం స్కూల్లో గంగిరెద్దుకు పూజలు



కొవ్వూరు సద్గురు పాఠశాలలో నృత్యాభినయం



ఉండ్రాజవరం మండలం వెలగదుర్రు ప్రాథమిక పాఠశాల్లో..

కోడి పందేలు ఆడితే కటకటాల పాలే..

- హెచ్చరించిన పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు
- గ్రామాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు



నిడదవోలు సచివాలయం వద్ద అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై నాగరాజు

నిడదవోలు: కోడి పందేలను ప్రభుత్వం నిషేధించినందున సంక్రాంతి ముసుగులో ఎవరూ కోడి పందేలు, జూదాల జోలికి పోవద్దంటూ పట్టణ పోలీసులు బుధవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. స్థానిక శాంతినగర్ వార్డు సచివాలయం వద్ద, మండలంలోని తిమ్మరాజుపాలెంలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎస్సై పి.నాగరాజు మాట్లాడారు. ఎవరైనా కోడి పందేలు నిర్వహించినా, పందాలు కాసినా, కోడి పుంజులను అమ్మినా నేరమన్నారు. అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడే వారి సమాచారాన్ని 08813 221033 నంబర్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

నిడదవోలు రూరల్: సంక్రాంతి పేరుతో కోడి పందేలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.గంగరాజు అన్నారు. సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో రెవెన్యూ, పోలీసు, సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో కోడి పందేలు, పేకాట, గుండాట, బెల్టుషాపుల నిర్వహణ తదితర అసాంఘిక కార్యక్రమాల నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్సైలు నాగరాజు, షేక్ సుభానీ, సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలి: సంక్రాంతి పండగ ముసుగులో కోడి పందేలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడం నేరమని ఎస్సై ఎం.సూర్యభగవాన్ అన్నారు. కోడి పందేలు నిర్వహించవద్దంటూ మండలంలోని కాకరపర్రు, కానూరు అగ్రహారం, కొత్తపల్లి అగ్రహారం గ్రామాల్లో పోలీసులు బుధవారం అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అసాంఘిక క్రీడలను వీడనాడి సంప్రదాయ క్రీడలను ఆడాలన్నారు. సదస్సుల్లో ఆయా పంచాయతీల సర్పంచులు గుబ్బల ఆదిలక్ష్మి, దానం వెంకన్న, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరు: కోడి పందేల నిర్వహణపై నిషేధాజ్ఞలు ఉన్నందున పందేలు నిర్వహించే వారు చట్టరీత్యా శిక్షార్హులవుతారని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ హెచ్చరించారు. కోడి పందేలు, ఇతర జూద క్రీడల నియంత్రణపై పశివేదల, నందమూరు గ్రామాల ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, మండల కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈనెల 9 నుంచి 25 వరకూ మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. ఇప్పటి వరకు మండలంలో 48 మందిని బైండోవర్ చేసుకుని రూ.5 లక్షల విలువైన స్వీయ బ్రాండ్లను తీసుకున్నామన్నారు.రూరల్ ఎస్సై జి.సతీష్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో కె.ప్రసన్నకుమార్, పశుసంవర్ధక శాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లు: కోడి పందేలు నిర్వహించవద్దంటూ మండలంలో చంద్రవరం, మల్లవరం, గౌరీపల్లి, దారవరం, మార్కొండపాడు, బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పారం తదితర గ్రామ పంచాయతీల వద్ద కార్యదర్శులు, వీఆర్‌వోలు, సచివాలయ మహిళా పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఎస్సై సీహెచ్‌వీ రమేష్ మాట్లాడుతూ కోడి పందేలు వద్దు సంప్రదాయ క్రీడలే ముద్దు అన్నారు.

డ్రోన్ సాయంతో భూముల రీ సర్వే



మలకపల్లిలో డ్రోన్ సాయంతో భూముల రీసర్వే ట్రయల్ రన్‌లో పాల్గొన్న జేసీ, ఎంపీపీ తదితరులు

తాళ్లపూడి: భూముల రీ సర్వేకు రెవెన్యూ, సర్వే సిబ్బంది డ్రోన్‌ను వినియోగిస్తున్న తీరును మండలంలోని మలకపల్లి గ్రామంలో బుధవారం జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ పరిశీలించారు. సర్వే ఏడీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ మార్చి నెలాఖరు నాటికి రీసర్వేను పూర్తిచేయాలన్నారు. ముందుగా ప్రాథమికంగా డ్రోన్‌తో సర్వే చేస్తారన్నారు. అనంతరం సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా సర్వే బృందం తమకు ఎదురవుతున్న సాంకేతిక పరమైన ఇబ్బందులను జేసీ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో మల్లిబాబు, ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, తహసీల్దార్ టి.రాధిక, సర్పంచ్ రాపాక రాజేశ్వరి, రీ సర్వే టీడీ భారతి, ఆర్ క్రాంతి రేఖ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

- ఎమ్మెల్యే తలారికి లక్ష్మీపురం వాసుల విజ్ఞప్తి
- గ్రామంలో గడప గడపకూ..



మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: మురుగు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, డ్రెయినేజీలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని లక్ష్మీపురం గ్రామస్తులు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కోరారు. బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ఎమ్మెల్యే లక్ష్మీపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన గడప గడపకూ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత మూడున్నరేళ్లగా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెంకట్రావు వివరించి బ్రోచర్లు అందజేశారు. గత మూడున్నరేళ్లలో ఒక్కొక్క కుటుంబానికి రూ.1 లక్ష నుంచి రూ. 3 లక్షల వరకు లబ్ధి చేకూరిందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వాలు ఇన్ని సంక్షేమ పథకాలు అందించాయా? అని ఆయన ప్రజలను అడిగారు. సంక్షేమ పథకాలు, పింఛన్ల పంపిణీ గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.గ్రామాన్ని ప్రధానంగా రోడ్లు, డ్రెయినేజీల సమస్య వెంటాడుతోందని, నిధులు మంజూరు చేసి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కోరారు. లక్ష్మీపురం సర్పంచ్ దొనెల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఉప సర్పంచ్ కె. భాస్కరరావు, మాజీ సర్పంచ్ దొనెల్లి జానకీరామ్, మాజీ ఎంపీపీ మేడిబోయిన గంగరాజు, ఎంపీటీసీ సభ్యులు సత్తి జగదీశ్వరరెడ్డి, రాయుడు వెంకట్రావు, పల్లంట్ల సర్పంచ్ నూతలపాటి వెంకటరమణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వ వైఫల్యం వల్లే గృహాల పంపిణీ ఆలస్యం

మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, కౌన్సిలర్లు

నిడదవోలు: గత టీడీపీ ప్రభుత్వ వైఫల్యం వల్లే స్థానిక తీరుగూడెంలోని టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేయడం ఆలస్యమవుతోందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. లబ్ధిదారులకు టిడ్కో గృహాలు అందజేయాలంటూ టీడీపీ నాయకులు పట్టణంలో బుధవారం ధర్నా చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు విలేకర్ల సమావేశంలో టీడీపీ నాయకుల తీరుపై మండి పడ్డారు. ఆదినారాయణ మాట్లాడుతూ కాంట్రాక్టర్‌కు టీడీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఆ బిల్లులను చెల్లించారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇక్కడ టిడ్కో గృహాల్లో ఒక్క ఫ్లాట్ కూడా లబ్ధిదారులకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కరోనా వల్ల కొంత ఆలస్యమైనా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి టిడ్కో గృహాల్లో పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించి దశల వారీగా లబ్ధిదారులకు ఇస్తారన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు మద్దిపాటి ఫణీంద్ర, కార్యదర్శి గాజుల రంగారావు, కౌన్సిలర్లు కామిశెట్టి వెంకట సత్యనారాయణ, ఎస్‌కే వజీరుద్దీన్‌లు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.